వీడ్కోలుకు వేళాయె..



గాంధీచౌక్‌లో శోభాయాత్ర వేదిక నిర్మాణ పనులను పరిశీలిస్తున్న స్తంభాద్రి ఉత్సవ సమితి ప్రతినిధులు

గణపతి శోభాయాత్ర, నిమజ్జనానికి సన్నద్ధం

- గాంధీచౌక్‌లో శోభాయాత్రకు స్వాగతం, వీడ్కోలు బహిరంగ సభ
- కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ ఘాట్‌ల వద్ద నిమజ్జన ఏర్పాట్లు
- అందుబాటులో 13 క్రేన్లు.. 60మంది గజ ఈతగాళ్లు
- నేడు వీడ్కోలు పలకనున్న భక్తజనం

ఖమ్మంగాంధీచౌక్: వినాయక చవితి నవరాత్రోత్సవాలను ఘనంగా జరుపుకున్న భక్త మండళ్లు నేడు (సోమవారం) ఆ గణనాథుల శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలకు సన్నద్ధమయ్యారు. ఇందుకు ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసి, ఉత్సవ కమిటీలకు ప్రాంతాల వారీగా దిశా నిర్దేశం చేసింది. ఎటువంటి అపశృతులు, అల్లర్లు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించి అధికారులు, సిబ్బందికి బాధ్యతలు అప్పగించింది.అంతేకాక సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. అయితే నగరంలో 800 నుంచి 1,000 విగ్రహాల వరకు ఈ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉన్నాయని భావించిన ప్రభుత్వ అధికారులు నిమజ్జన ఘాట్ వద్దకు చేరుకునేలా రూట్‌మ్యాప్‌లను ఏర్పాటు చేశారు. అయితే భారీ వర్షాలు, వరదలకు దెబ్బతిన్న కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ నిమజ్జన ఘాట్‌లను మున్సిపల్ శాఖ ఆధ్వర్యాన పునరుద్ధరించి అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. కాగా, శోభాయాత్ర, నిమజ్జన కార్యక్రమాలలో ప్రధానంగా పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖలతో పాటు అగ్నిమాపక, మత్స్య శాఖాధికారులు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలకు డీజేలకు అనుమతులు లేవు.

గాంధీచౌక్‌లో శోభాయాత్ర ప్రారంభం..



గాంధీచౌక్‌లో వీడ్కోలు బహిరంగ సభకు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నగరం నలుమూలల నుంచి తరలి వచ్చే గణనాథుల శోభాయాత్రకు గాంధీచౌక్‌లో ఘనస్వాగతం పలికేవిధంగా స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఏర్పాట్లు జరుగుతున్నాయి. నగరంలో ఉదయం 10:30 గంటల నుంచి ఊరేగింపులు, శోభాయాత్రలు ప్రారంభమవుతుండగా.. మధ్యాహ్నం 3:30 గంటలకు గాంధీచౌక్ సెంటర్‌లో సార్వజనిక గణేశ్ నిమజ్జన వీడ్కోలు బహిరంగ సభ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా మంత్రులతో పాటు ఎంపీలు, కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కమిషనర్లు, మేయర్ తదితరులు హాజరుకానున్నారు.

సిద్ధమైన గణేశ్ ఘాట్‌లు..

నగరం నలుమూలల నుంచి వచ్చే వినాయక విగ్రహాలను త్రీటౌన్‌లోని కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్ ఘాట్‌ల వద్ద నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకోసం వాహనాలు వచ్చేందుకు ఒక మార్గం, వెళ్లేందుకు మరో మార్గం ఏర్పాటు చేసి సూచిక బోర్డులు అమర్చారు. అంతేకాక సీసీ కెమెరాలు, విద్యుత్ సౌకర్యం, జనరేటర్లు వంటివి కూడా ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జన వాహనాల వెంట ఇద్దరికి మించి అనుమతులు ఇవ్వలేదు.

13 క్రేన్లు.. 60 మంది గజ ఈతగాళ్లతో..



కాల్వొడ్డులో నిమజ్జన ఏర్పాట్లు

గణపతి నిమజ్జనానికి 13 క్రేన్లు, 60 మంది గత ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. ఇందులో కాల్వొడ్డులో 10 క్రేన్లు, 40 మంది గజ ఈతగాళ్లు ఉండగా, ప్రకాశ్‌నగర్‌లో మూడు క్రేన్లు, 20 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. తాళ్లతో ఉన్న క్రైయిన్లతో నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తుండగా.. మట్టితో ఉన్న పెద్ద విగ్రహాలను మాత్రం బల్లలతో ఉన్న క్రేన్లను ఏర్పాటు చేశారు. మున్నేరు నీటి ప్రవాహం సాధారణ స్థాయిలో ఉన్నప్పటికీ నీటిలోకి గజ ఈతగాళ్లు మినహా ఇతరులను అనుమతించడం లేదు. కాగా, సీపీ సునీల్‌దత్ పర్యవేక్షణలో ఎటువంటి అపశృతులు చోటు చేసుకోకుండా కాల్వొడ్డు వద్ద వార్ రూం ఏర్పాటు చేయించారు.

నిబంధనల నడుమ వీడ్కోలు..



నిబంధనల నడుమ గణనాథుడి వీడ్కోలు కార్యక్రమాన్ని చేపట్టాలి. ప్రభుత్వ శాఖలు నిర్దేశించిన విధంగా శోభాయాత్రలు నిర్వహించి, గాంధీచౌక్‌లో నిర్వహించే వీడ్కోలు కార్యక్రమం గుండా కాల్వొడ్డు, ప్రకాశ్‌నగర్‌లలో ఏర్పాటు చేసిన ఘాట్‌ల వద్ద నిమజ్జనం చేయాలి. భక్తులందరూ గణపతికి వైభవంగా వీడ్కోలు పలకాలి.

– వినోద్ లాహోటి, స్తంభాద్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

క్లుప్తంగా

'బొమ్మ'లో ఇంజనీర్స్‌డే వేడుకలు



నివాళులర్పిస్తున్న చైర్మన్ రాజేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: నగరంలోని బొమ్మ ఇంజనీరింగ్ కాలేజీలో ఆదివారం ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బొమ్మ విద్యాసంస్థల చైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్యప్రసాద్, కార్యదర్శి శ్రీధర్, ప్రిన్సిపాల్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

కోటయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: మున్నేరు వరదలతో ఇళ్లు కోల్పోయి గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ మరణించిన దానవాయిగూడెం ప్రాంతానికి చెందిన కోటయ్య(60) కుటుంబానికి న్యాయం చేయాలని బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు కోరారు. కష్టపడి సంపాదించుకున్న ఆస్తి, నిర్మించుకున్న ఇళ్లు వరద ఉధృతికి కోల్పోవడంతో మనోధైర్యం కోల్పోయి గుండెపోటుతో మరణించాడన్నారు. బీఆర్‌ఎస్ నేతలు కోటయ్య మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ తోట రామారావు కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమయ్య

నేలకొండపల్లి: రాష్ట్ర సాధన కోసం కొట్లాడిన ఉద్యమకారులకు బతుకుల్లో చీకట్లు కమ్ముకున్నాయని, ఉద్యమానికి ఎలాంటి సంబంధం లేని వారు నేడు బోగాలు అనుభవిస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సుల్తాన్ యాదగిరి అన్నారు. మండలంలోని కొత్తకొత్తూరులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ నియంత పాలనలో తెలంగాణ అంతమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. ఉద్యమకారులకు పింఛన్ ఇచ్చి గౌరవించాలని సూచించారు. అమరులైన వీరుల కుటుంబాలకు ఐక్య వేదిక అండగా నిలుస్తుందని, స్వరాష్ట్రంలో ఫలాలు అందించే వరకు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల మాతృ వియోగం పొందిన ఎం.శ్రీనివాసరావును పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి, ఉపాధ్యక్షుడు బత్తుల సోమయ్య, జిల్లా అధ్యక్షుడు మాదాసు శ్రీనివాసరావు, వెంకటనారాయణ, తీగ రాములు, భిక్షం, అఫ్జల్, వెంకటనారాయణ, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సరిపోదా శనివారం
వినోద	ద గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం
సాయిరాం	భలే ఉన్నాడే!
ఆదిత్య	అయ్
శ్రీనివాస	35(2024)
సీఎన్ సినీ గెలాక్సీ	కమిటీ కుర్రోళ్లు, డిమాంట్ కాలనీ 2

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	44	బచ్చలికూర	3
వంకాయ	86		20
బెండకాయ	46	పాలకూర	3
పచ్చిమిర్చి	28		20
కాకర	60	చుక్కకూర	3
బోడ కాకర	150		20
బీర	50	తోటకూర	3
దొండ	46		20
పొట్లకాయ	60	గోంగూర	5
చిక్కుడు	100		20
గోరుచిక్కుడు	40	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	44		50
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	60		25
క్యాప్సికం	76	-ఖమ్మం వ్యవసాయం	

వరద బాధితులకు బాసట

రాకాసితండా ప్రజలకు అన్నదానం..



జూపెడలో నిత్యావసర కిట్లు, ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

◆ తిరుమలాయపాలెం: ఆకేరు వరదలో సర్వస్వం కోల్పోయిన రాకాసితండా ప్రజలకు మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన తాతా విశ్వేశ్వరరావు తన కుమారుడు నిఖిల్ చౌదరి జ్ఞాపకార్థం ఆదివారం అన్నదానంతో పాటు ప్లేట్లు, గ్లాసులు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, తాతా రవీందర్, అశ్వినికుమార్, మళ్లీడు రమేష్, చావా శ్రీనివాస్, తూము వెంకటేశ్వర్లు, మద్దెల విజయ్,, మాజీ సర్పంచ్ బానోత్ రవి, అజ్మీర బాలాజీ నాయక్, బానోత్ రమేష్, బానోత్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

15ఆర్‌కెఎం301– తిరుమలాయపాలెం: ప్లేట్లు, గ్లాసులు అందిస్తున్న విశ్వేశ్వరరావు

ప్రతీ ఇంటికి పీఎస్‌ఆర్ సాయం..



ఆర్థిక సాయం, దుప్పట్లు అందజేస్తున్న పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

మండలంలోని వరద ముంపునకు గురైన ప్రతి ఇంటికీ వరద సాయం అందించేందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన రూ.5వేల ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర కిట్లను ఆదివారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చావా శివరామకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి మండల పరిధిలోని కాకరవాయి, జూపెడ, బంధంపల్లి, తిప్పారెడ్డిగూడెం, రాకాసి తండా గ్రామాలలో ప్రతీ కుటుంబానికి సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు అశోక్, మంగీలాల్, మండల కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, ఉన్నం రాజశేఖర్, తాటికొండ కిరణ్, పోట్ల కిరణ్, ఉపేందర్, జడల నగేష్, సుధాకర్ రెడ్డి, మిరియాల విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఖమ్మంరూరల్ మండలంలోని నాయుడుపేట, ఇందిరమ్మ కాలనీలోని వరద బాధితులకు పీఎస్‌ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి రూ.5వేల ఆర్థిక సాయంతో పాటు దుప్పట్లు అందించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్‌నాయక్, అశోక్‌నాయక్, భద్రకాళి, భాస్కర్, మల్లయ్య, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచన గొప్పది..



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఏసీపీ నరసయ్య

◆ ఖమ్మంవైద్యవిభాగం: సమాజం నుంచి సాయం పొందడమే కాకుండా సమాజానికి తిరిగి ఇవ్వాలనే ఆలోచన సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ, తలసేమియా చిన్నారులకు రావడం గొప్పదని ఏఆర్ ఏసీపీ ఎస్.నరసయ్య అన్నారు. ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మున్నేరు వరద బాధితులకు ధంసలాపురం వద్ద నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వరదలతో సర్వం కోల్పోయిన బాధితులకు రూ.లక్ష విలువైన సరుకులు, దుప్పట్లు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు పి.అనిత, పి.పావని, పి.ఉదయభాస్కర్, పి.రవిచంద్ర, పి.వంశికిరీటి, ఎన్.ఉపేందర్, కృష్ణ, హరీష్, బాబూరావు, తలసేమియా చిన్నారులు పాల్గొన్నారు.

300 మందికి నిత్యావసరాలు..



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఆర్‌జేసీ కృష్ణ

◆ ఖమ్మం మామిళ్లగూడెం: మున్నేరు వరద బాధితులకు అమెరికాకు చెందిన ఆప్టా సంస్థ, ఆర్‌జేసీ కృష్ణ సంయుక్త ఆధ్వర్యాన సమకూర్చిన నిత్యావసర వస్తువులు, కూరగాయలను 300 మందికి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేసీ కృష్ణ మాట్లాడుతూ.. వరదలకు సర్వస్వం కోల్పోయిన వారికి ఆప్టా సంస్థ ప్రెసిడెంట్ ముద్రగడ త్రినాథ్, గ్లోబల్ ఆపరేషన్స్ బాధ్యులు వుల్లి మధు, గుండాల కార్తీక్‌లు చేసిన సాయం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తోట రామారావు, కనకంభద్రయ్య, మాటేటి నాగేశ్వరావు, కన్నం ప్రసన్నకృష్ణ, వెంకటేశ్వరావు, గుండాల అప్పారావు, గుండాల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఎంట్రీ, ఎగ్జిట్ లేనట్టే..!

- ప్రమాదాలకు ఆస్కారం ఉందని వెనకడుగు
- 31 కిలో మీటర్ల రోడ్డులో.. 25 కి.మీ సర్వీస్ రోడ్డు ఉందని వాదన

నేలకొండపల్లి: కోదాడ–ఖమ్మం జాతీయ రహదారిలో భాగంగా నేలకొండపల్లి మండల కేంద్రంలో ఎంట్రీ, ఎగ్జిట్ ఇవ్వాలని గత కొంత కాలంగా స్థానికులు ఆందోళన చేపట్టారు. కానీ సాధ్య,సాధ్యాలను పరిశీలించిన తర్వాత సంబంధిత అధికారులు ఇవ్వడం కుదరదనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జాతీయ రహదారిలో మొత్తం 31 కిలోమీటర్ రోడ్డులో 25 కిలో మీటర్ల వరకు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేశారు. అయితే మండలంలోని కోనాయిగూడెం వైపు వెళ్లే రహదారిలో అండర్ పాస్ సమీపాన, ఆచార్లగూడెంకు వెళ్లే దారి వద్ద ఎగ్జిట్, ఎంట్రీ ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేయగా.. ఈ రెండు ప్రాంతాల్లో ఎక్కడ ఇచ్చినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనాకు వచ్చారు. తాజాగా గత రెండు రోజుల క్రితం జాతీయ రహదారులకు సంబంధించిన అధికారుల కారును హైవేలో ట్రాక్టర్ ఢీకొట్టగా వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఇదిలా ఉండగా ఇప్పటి వరకు ఎంట్రీ, ఎగ్జిట్ గురించి ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ సంబంధిత అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తం మీద నేలకొండపల్లిలో ఎంట్రీ, ఎగ్జిట్ ఇచ్చే అవకాశాలు కనిపించకపోవడంతో ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు స్థానికులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఉమ్రా యాత్రలో అల్లా నామస్మరణ చేయాలి



బ్యాగ్ అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఉమ్రా యాత్రలో సదా అల్లా నామస్మరణ చేయాలని దారుల్ ఉలూం కరస్పాండెంట్ ముక్తి జలాలుద్దిన్ కాస్మీ, అరబ్బీ ఉపాధ్యాయులు ముఫ్తీ అహ్మద్ ఇశాతి అన్నారు. ఈ నెల 18న ఉమ్రా కు వెళ్తున్న ఉలమాలు, హుస్సాజులకు ఆదివారం ఖమ్మం రోటరీనగర్ సమీపంలోని సిటీ సెంట్రల్ కన్వెన్షన్ హాల్లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తవ్వాఫ్ టూర్ అండ్ ట్రావెల్స్ హజ్, ఉమ్రా సర్వీసెస్ నిర్వాహకులు హఫీజ్ జవ్వాద్ అహ్మద్, ఉలమాలు, ఉస్సాజ్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు.. అన్నదానాలు

వినాయకుడి నవరాత్రి ఉత్సవాలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం గణేశుడికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యాన అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. ఆయా మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ, కలశాలను వేల పాటలో భక్తులు పోటాపోటీగా పాల్గొని వాటిని దక్కించుకున్నారు. పలు చోట్ల ఊరేగింపుగా వెళ్లి గణపతి నిమజ్జనాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: శ్రీ గాయత్రినగర్‌లో గాయత్రి హోమం చేస్తున్న దంపతులు



నేలకొండపల్లిలో గణపతికి 123 రకాల నైవేద్యాలను సమర్పించిన భక్తులు



నేలకొండపల్లి: మోటాపురం వేలంపాటలో కలశాన్ని దక్కించుకున్న రావెళ్ల కృష్ణారావు–మాలతి దంపతులు



ఖమ్మంఅర్బన్: బాలగణపతి కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరిపిస్తున్న అర్చకులు



ఖమ్మం సహకారనగర్: స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో పూజలు చేస్తున్న దృశ్యం



ఖమ్మంగాంధీచౌక్: 58వ డివిజన్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



రఘునాథపాలెం: వీవీపాలెంలో అన్నదానం



కామేపల్లి: కొత్తలింగాలలో అన్నదానం..



ఖమ్మంఅర్బన్: మధురానగర్‌లోని సాయి మందిరంలో పూజలో పాల్గొన్న భక్తులు



ఖమ్మంరూరల్: ఏదులాపురం శివారు రాఘవేంద్రనగర్‌లో కోలాటం ఆడుతున్న దృశ్యం

గణనాథుడికి మంత్రి పొంగులేటి పూజలు



ఖమ్మంరూరల్: పెదతండాలో పూజలు చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మంరూరల్/ఖమ్మంఅర్బన్: నగరంలోని పలు ప్రాంతాలతో పాటు ఖమ్మంరూరల్ మండలంలోని పెద్దతండా, శ్రీరాంనగర్ – 2లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయా మండపాలకు విరాళాలు అందించి అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణపతి నవరాత్రులను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారని, నేడు జరిగే శోభాయాత్రను ఘనంగా జరుపుకోవాలన్నారు. వినాయక విగ్రహాలను నెలకొల్పిన ఉత్సవ కమిటీ సభ్యులను మంత్రి అభినందించారు. ఆయా మండపాల కమిటీ సభ్యులు మంత్రి పొంగులేటిని శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట తుంబూరు దయాకర్‌రెడ్డి, సూతకాని జయపాల్, మిక్కిలినేని నరేందర్, పోట్ల వీరేందర్, చింతనిప్పు క్రిష్ణ చైతన్య, తొగరు చిన్నా, నరేష్‌కుమార్, కారుమంచి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వరద ముంపుతో భారీగా నష్టపోయిన 20 మెకానిక్ కుటుంబాలను ఆదుకోవాలంటూ ఖమ్మం టూవీలర్స్ మెకానిక్‌ల అసోసియేషన్ ఆధ్వర్యాన మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంగాల కొండలరావు, లాలయ్య, రామనాథం, ఖాన్, నవీన్, చారి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

తిరుమలాయపాలెం: మండలంలో సోమవారం నిర్వహించే వినాయక నిమజ్జన వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, ఎస్‌ఐ జగదీష్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్‌లు కోరారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలోనే ఉండి నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షించాలని, సాయంత్రం 5 గంటలలోపే నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

● వరద దెబ్బకు వాగు శుభ్రం..



శుభ్రమైన ఖానాపురం అలుగువాగు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ, 11వ డివిజన్ల పరిధిలో ఇటీవల వచ్చిన వరదల కారణంగా పూడుకుపోయిన ఖానాపురం అలుగు వాగును 4, 5 ప్రొక్లైనర్ల ద్వారా గత నాలుగు రోజులు నుంచి పూడికతీత పనులు చేపట్టడంతో పరిశుభ్రంగా తయారైంది. సాగర్ ప్రధాన కాల్వ అలుగు వాగు నుంచి చైతన్యనగర్, కవిరాజ్‌నగర్‌లో లకారం ట్యాంక్ బండ్ చెరువుల వరకు శుభ్రం చేశారు. వాటి పరిధిలో ఉన్న ఐస్ ఫ్యాక్టరీని తొలగించగా.. పక్కా నిర్మాణాలు మాత్రం ఇంకా తొలగించలేదని స్థానికులు చెబుతున్నారు. వాగు కొలతలు ప్రకారం కాకుండా ఇరువైపుల స్థలాలను బట్టి వెడల్పు చేశారని, ఇక ఎంత వరద వచ్చినా నివాసాల్లోకి మాత్రం వరద నీరు చేరే అవకాశం ఉండదని స్థానికులు పేర్కొంటున్నారు.